సీఎం జగన్‌పై ప్రజలకు పూర్తి విశ్వాసం

- మెగా సర్వేలో వెల్లడైన వాస్తవాలు
- ప్రతిపక్షాల బూటకపు ప్రచారాలకు చెల్లు
- వేర్వేరు సమావేశాల్లో జెడ్పీ ఛైర్మన్ కవురు శ్రీనివాస్, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు వెల్లడి



పాలకొల్లు వైసీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న జెడ్పీ ఛైర్మన్ కవురు శ్రీనివాస్



తూర్పుపాలెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు, చిత్రంలో షర్మిలారెడ్డి

పాలకొల్లు అర్బన్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై రాష్ట్ర ప్రజలు పూర్తి విశ్వాసంతో ఉన్నారని జెడ్పీ ఛైర్మన్ కవురు శ్రీనివాస్ స్పష్టం చేశారు. పాలకొల్లు వైసీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 7 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించిన మెగా సర్వేలో రాష్ట్ర వ్యాప్తంగా 1.45లక్షల కుటుంబాలను గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులు సందర్శించగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాల పథకాలను సమర్థిస్తూ 1.10లక్షల కుటుంబాల నుంచి రాష్ట్ర కార్యాలయానికి మిస్డ్ కాల్స్ చేరాయన్నారు. రాష్ట్రంలోని 90 శాతం పైగా సంక్షేమ పథకాలను కొనసాగించాలని, మరలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రావాలని ప్రజలు కోరుతున్నారని సర్వేలో వెల్లడయ్యిందని శ్రీనివాస్ అన్నారు.

పాలకొల్లులో వైసీపీ జెండా ఎగరేస్తాం

2024లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో పాలకొల్లు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరేస్తామని శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో జెడ్పీటీసీ నడపన గోవిందరాజుల నాయుడు, పార్టీ మండల కన్వీనర్ ఎం మైఖేల్‌రాజు, సచివాలయ కన్వీనర్లు ఎంఎస్ వాసు, పార్శి వెంకటరత్నం, ఆలయాల చైర్మన్లు కె.శ్రీనివాసరావు, కావలి శ్రీనివాసరావు, గాదె వెంకన్న, నంబూరు శ్రీ గంగా పవన్, జోగి వెంకటేశ్వరరావు, ఖండవల్లి వాసు, బళ్ల రాజశేఖర్, ఓదూరి భాస్కరరావు, జె.సువర్ణరాజు పాల్గొన్నారు.

జగనన్న పరిపాలనకు వాడవాడలా బ్రహ్మరథం

పోడూరు: సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక పరిపాలనతో గ్రామాల్లో గడపగడపకు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాలకు వెళ్లినపుడు ప్రజలు వాడవాడలా తమకు బ్రహ్మరథం పడుతున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. ఆచంట నియోజకవర్గ వ్యాప్తంగా మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం పూర్తయిన సందర్భంగా తూర్పుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన నియోజకవర్గ పరిశీలకురాలు, రుడా ఛైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డితో కలిసి సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా 76వేల కుటుంబాలుంటే దాదాపు 20 రోజుల్లో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో 68వేల కుటుంబాలను నేరుగా కలిసినట్లు చెప్పారు. వారిలో 55వేల కుటుంబాలు 82960 82960 సెల్ నంబర్‌కు మిస్డ్‌కాల్ చేసి మద్దతు తెలిపారన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ వ్యాప్తంగా 146 రోజుల్లో 64 గ్రామ సచివాలయాల పరిధిలో ఇంటింటికీ పర్యటించామన్నారు. మళ్లీ రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి పట్టం కట్టేందుకు ప్రజలంతా ఎదురు చూస్తున్నారన్నారు. నియోజకవర్గంలో గడపగడపకు మన ప్రభుత్వం, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాలు విజయవంతమవడంపై పరిశీలకురాలు షర్మిలారెడ్డికి, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఏఎంసీ చైర్మన్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు, గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

ఇతర రాష్ట్రాలన్నీ ఏపీ వైపు చూస్తున్నాయి

నియోజకవర్గ పరిశీలకురాలు, రుడా ఛైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అందిస్తున్న పారదర్శకమైన పరిపాలన, సంక్షేమం, అభివృద్ధి, దేశంలో ఇతర రాష్ట్రాలన్నీ ఏపీ వైపు చూస్తున్నాయన్నారు. సమావేశంలో పెనుగొండ, ఆచంట ఏఎంసీ చైర్మన్లు వెలగల వెంకటరమణ (మిస్సమ్మ), చిల్లే లావణ్య, పోడూరు, పెనుమంట్ర ఎంపీపీలు సబ్బితి సుమంగళి సాగర్, కర్రి వెంకటనారాయణరెడ్డి (వాసు), జెడ్పీటీసీలు గుంటూరి పెద్దిరాజు, కర్రి గౌరీ సుభాషిణి, పోడూరు మండల కన్వీనర్ పిల్లి నాగన్న, ఏపీ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుమూడి రామచంద్రరావు, జేసీఎస్ కన్వీనర్లు పైడి ఏసుబాబు, సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్, చిన్నారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యకు సీఎం జగన్ అండ

పెనుగొండ: ప్రభుత్వ విద్యను బలోపేతం చేసి పేదలకు విద్యను దగ్గర చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని పెనుగొండ మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షురాలు దండు పద్మావతి అన్నారు. శనివారం ఇలపర్రులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవంలో ఆమె పాల్గొన్నారు. సొసైటీ ఛైర్ పర్సన్ వేండ్ర వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు పులిదిండి వెంకటేశ్వరరావు, విద్యా కమిటీ ఛైర్మన్ యల్లమెల్లి భీమయ్య, మాజీ సర్పంచ్ కేతా భీముడు, హెచ్ఎం రామకృష్ణ పాల్గొన్నారు.

102 మంది కన్యలతో పూజ


మూల విరాట్ వాసవీ మాత

పెనుగొండ: వాసవీ కన్యపరమేశ్వరి అమ్మవారి జయంత్యుత్సవాల్లో భాగంగా పెనుగొండ శ్రీ నగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో శనివారం 102 మంది కన్యలతో పూజ, లక్ష మల్లికా పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. అమ్మవార్లకు కుంకుమ పూజలు నిర్వహించారు. వాసవీ భక్తులు, వేద పండితుల పర్యవేక్షణలో 102 కన్యల పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం లక్ష మల్లికా పుష్పార్చన నిర్వహించారు. ఆత్మాభిమానమే మిన్నగా భావించి, ప్రాణ త్యాగం చేసిన వాసవీ కన్యకపరమేశ్వరి మాత జయంత్యుత్సవాన్ని ఆదివారం నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేసినట్టు ఆలయ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ కోట్ల మోహనరావు, కార్యదర్శి జీఎస్ఎస్ శ్రీనివాస్ తెలిపారు.

మావుళ్లమ్మ ఆలయం వద్ద హోమం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక బ్రాడీపేటలో మావుళ్లమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్ఠామహోత్సవ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు శనివారం ప్రత్యేక హోమాలు నిర్వహించారు. పురోహితులు ఈరంకి కాశి బ్రహ్మత్వంలో గేదెల శ్రీనివాసరావు, వెంకటరమణ, మన్నెపూరి శ్రీనివాసు, పద్మావతి, రెడ్డి చిన వెంకట సత్యనారాయణ, భారతి దంపతులు ఈ పూజలు చేశారు.

డాక్టర్ బాలచందర్‌కు అంతర్జాతీయ అవార్డు

పెనుగొండ: సాహిత్య, సామాజిక సేవలకు గుర్తింపుగా ఫిలంత్రోఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో పెనుగొండకు చెందిన అస్కా ఛైర్మన్, మానవత అధ్యక్షుడు, ఎస్వీకేపీ అండ్ పితాని వెంకన్న జూనియర్ కళాశాల తెలుగు శాఖాధిపతి డాక్టర్ ఎస్ బాలచందర్‌ను అంతర్జాతీయ అవార్డుతో ఘనంగా సత్కరించారు. బాలచందర్ పెనుగొండలో శనివారం మాట్లాడుతూ గుడ్ సుమారిటన్ ఇంటర్నేషనల్ అవార్డుల ప్రధానోత్సవ సభలో అమెరికా చెందిన ప్రొఫెసర్ జోసెఫ్ యాన్, పీస్ అంబాసిడర్ సౌత్ ఇండియా చాప్టర్ డాక్టర్ అద్దంకి రాజా చేతుల మీదుగా అవార్డును అందుకున్నట్లు వివరించారు. బాలచందర్‌ను పలువురు అభినందించారు.

క్లుప్తంగా

జోరుగా 'జగనన్నే మా భవిష్యత్తు'

మొగల్తూరు: నెలరోజులుగా మండలంలోని పలుగ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం జోరుగా సాగింది. గ్రామానికి చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, గృహ సారథులు, కన్వీనర్లు, వలంటీర్లు ఇంటింటికీ తిరుగుతూ బ్రోచర్లు అందిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు కావాలంటే జగనన్నే అధికారంలోకి రావాలని పార్టీ నాయకులు పేర్కొన్నారు. శనివారం స్థానిక పార్టీ నాయకులు నక్కావారిపాలెంలో ఇంటింటికీ తిరుగుతూ బ్రోచర్లు అందిస్తూ రాబోయే రోజుల్లోనూ సీఎం జగనన్నకు మద్దతు పలకాలని కోరుతున్నారు.

శ్రీశ్రీ కవితా ప్రస్థానం గొప్పది

నరసాపురం: మహాకవి శ్రీశ్రీ కవితా ప్రస్థానం గొప్పగా సాగిందని తణుకు ఎస్‌కేఎస్‌టీ మహిళా కళాశాల తెలుగు విభాగం హెడ్ పి.శిప్రసాద్ అన్నారు. శ్రీశ్రీ జయంతిని పురస్కరించుకుని శనివారం వైఎన్ కళాశాలలో తెలుగుశాఖ ఆధ్వర్యంలో అభ్యుదయ యుగకర్త శ్రీశ్రీ అనే అంశంపై అతిథి ఉపన్యాసం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ఏపీవీ అప్పారావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌వీ సుబ్బారావు, వై.వెంకటేశ్వరరావు, ఎస్ యాకోబ్, సాయికృష్ణ పాల్గొన్నారు.

విద్యతో సామాజిక మార్పు

పాలకొల్లు సెంట్రల్: సామాజిక మార్పు అనేది విద్య ద్వారానే సాధ్యమవుతుందని ప్రముఖ విద్యావేత్త, సామాజిక ఉద్యమకారుడు ప్రొఫెసర్ జి హరగోపాల్ తెలిపారు. శనివారం దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాజనీతి శాస్త్ర విభాగం సంయుక్త ఆధ్వర్యంలో మానవతా వాది బి.ఆర్ అంబేడ్కర్ అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఢిల్లీ విశ్వవిద్యాలయం రాజనీతి శాస్త్ర ప్రొఫెసర్ సుకుమార్ ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారు. ప్రొఫెసర్ జి వనమాలి, రాజోలు కళాశాల ప్రిన్సిపాల్ సాయిబాబా, డీఎన్నార్ ప్రిన్సిపాల్ శోభారాణి పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సమ ప్రాధాన్యం


శిరగాలపల్లిలో బస్ షెల్టర్ ప్రారంభించిన జెడ్పీ ఛైర్మన్ కవురు శ్రీనివాస్

యలమంచిలి: అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ప్రభుత్వం సమప్రాధాన్యమిస్తోందని జెడ్పీ ఛైర్మన్, వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ అన్నారు. మండలంలోని శిరగాలపల్లిలో శనివారం జిల్లా పరిషత్ నిధులు రూ.35 లక్షలతో నిర్మించిన బస్ షెల్టర్, ఎస్సీ కమ్యూనిటీహాల్, మల్టీ పర్పస్ బిల్డింగ్‌లను ఆయన ప్రారంభించారు. సర్పంచ్ చిలుకూరి సుబ్బారావు చౌదరి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాతర్తి బుచ్చిరాజు, పార్టీ చింతలపూడి నియోజకవర్గ పరిశీలకులు గుణ్ణం నాగబాబు, సర్పంచ్‌ల చాంబర్ మండల అధ్యక్షుడు వల్లభు సాయి వెంకట నరసింహారావు, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు, వైఎస్సార్ సీపీ శిరగాలపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు వీరవల్లి నరసింహమూర్తి సచివాలయ కన్వీనర్లు, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి మెండుగా ప్రజాభిమానం



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నరసాపురం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వానికి ప్రజాభిమానం మెండుగా ఉందని ఆపార్టీ నేత, కార్యక్రమం నరసాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ గంటా ప్రసాద్ స్పష్టం చేశారు. నరసాపురం నియోజకవర్గంలో కార్యక్రమం పూర్తయిన సందర్భంగా శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నరసాపురం నియోజకవర్గంలోని 70వేల కుటుంబాల్లో 68,500 కుటుంబాలను ఇప్పటి వరకూ కలిసినట్టు తెలిపారు. అందులో 55 వేల కుటుంబాల వారు మిస్డ్‌కాల్ ద్వారా వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మద్దతు తెలిపారన్నారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, వైస్ ఛైర్ పర్సన్ కామన నాగిని, జెడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాధాకృష్ణ, సచివాలయాల మండల కన్వీనర్లు గోరు సత్తిబాబు, తిరుమాని కృష్ణంరాజు, ఎంపీపీ మైలాబత్తుల సోనీ, వైస్ ఎంపీపీ ఉంగరాల రమేష్, పార్టీ పట్టణ అధ్యక్షుడు బూసరపు జయ, కడలి రాంబాబు పాల్గొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో యథావిధిగా రిజిస్ట్రేషన్లు

నరసాపురం: నరసాపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంపై బుధవారం ఏసీబీ దాడులు జరిగిన తరువాత రెండురోజుల పాటు నిలిచిన రిజిస్ట్రేషన్లు శనివారం పునఃప్రారంభమయ్యాయి. ఏలూరు ఏసీబీ డీఎస్పీ కార్యాలయానికి విచారణ నిమిత్తం హాజరైన సబ్‌రిజిస్ట్రార్ వీరభద్రరావు, సిబ్బంది విధులకు హాజరయ్యారు. దాడుల్లో సబ్‌రిజిస్ట్రార్ వద్ద, ఉద్యోగులు వద్ద అనధికరికంగా ఉన్న రూ.59 వేలు ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విచారణ అనంతరం అధికారులు నివేదికను స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు అందించడంతో శాఖాపరమైన దర్యాప్తునకు ఉపక్రమించింది. గతే దాది కాలంగా ఈ కార్యాలయంలో జరిగిన రిజిస్ట్రేషన్లపై వివరాలు సేకరిస్తోంది. శనివారం దీనికి సంబంధించి మొగల్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి ఒక ఉద్యోగిని ఇక్కడ నియమించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న కొందరు లేఖర్లు ఇంకా అజ్ఞాతం వీడలేదు. సబ్‌రిజిస్ట్రార్ వద్ద అనధికార సొమ్మును కనుగొనడమే కాకుండా, కొంతకాలంగా ఈ కార్యాలయం కేంద్రంగా జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్లపైనే ఏసీబీతో పాటు రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు దృష్టిపెట్టారు. నిబంధనలు అతిక్రమించి, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులతో కుమ్మక్కై అక్రమాలకు పాల్పడిన కొందరు లేఖర్లు మూడురోజుల నుంచి కార్యాలయం వద్ద కనిపించడం లేదు. దర్యాప్తులో ఎవరి పేర్లు బయటకు వస్తాయన్న దానిపై కార్యాలయ అధికారులు, సిబ్బంది, దస్తావేజుల లేఖర్లలో చర్చనీయాంశంగా మారింది.

ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

పాలకొల్లు అర్బన్: ఇంటర్ ఫలితాల్లో లంకలకోడేరు అల్లూరి సీతారామరాజు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ పి రమేష్‌రాజు తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో ఎం.దివ్యశ్రీ 974, పి.అఖిల్ 952, ఎ.తేజస్విని 928, బైపీసీ విభాగంలో కె మౌనిక 914, సీఈసీ విభాగంలో జె జ్యోతి మహిమ 925 సాధించారన్నారు. జూనియర్ ఇంటర్ ఫలితాల్లో యు ప్రణతి 473, ఎం కుసుమ 447, ఎంపీసీ విభాగంలో ఎ స్రవంతి 423, సీహెచ్‌టీ శ్రీనిజ 414, ఎం వైష్ణవి 400 మార్కులు సాధించారన్నారు. హెచ్ఈసీ విభాగంలో ఎ సత్యహారిక 423, బైపీసీ విభాగంలో వై అంజలి 413 సాధించారన్నారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు పెన్మెత్స వెంకట రామసూర్యనారాయణరాజు, అల్లూరి సుబ్రహ్మణ్య రమేష్, ఉపాధ్యక్షుడు తాళ్లూరి సూర్యప్రకాశరావు, కళాశాల పాలకవర్గ సభ్యులు వేగేశ్న సూర్యనారాయణరాజు, పెన్మెత్స రామలింగరాజు, ఏవీబీ కృష్ణంరాజు, వేగేశ్న మురళీకృష్ణంరాజు ప్రత్యేకంగా అభినందించారు.

భార్యాభర్తలకు గాయాలు

పాలకొల్లు అర్బన్: చించినాడ – దిగమర్రు జాతీయ రహదారిలో పెదమామిడిపల్లి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటార్‌సైకిల్‌పై వెళుతున్న భార్యాభర్తలు గాయపడ్డారు. యలమంచిలి మండలం చించినాడకు చెందిన మేడిది నాగదుర్గారావు అతని భార్య దుర్గాభవాని మోటార్‌సైకిల్‌పై పాలకొల్లు వచ్చి తిరిగి చించినాడ వెళుతున్నారు. భార్య దుర్గాభవానికి ఫిట్స్ వచ్చి బండిపై కూర్చుని వణుకుతున్నట్లు గమనించి దుర్గారావు వెనక్కి తిరిగి చూడడంతో బండి అదుపుతప్పి రెయిలింగ్‌ని ఢీకొట్టింది. దీంతో దుర్గారావు తలకు బలమైన గాయాలయ్యాయి. దిగమర్రు సర్పంచ్ రాపాక నగేష్ కరుణాకర్, స్థానికులు 108కి ఫోన్ చేశారు. ఈ లోగా హైవే పెట్రోలింగ్ టీమ్ క్షతగాత్రులను పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దుర్గారావుకి మెరుగైన వైద్యం నిమిత్తం భీమవరం ఆసుపత్రికి తరలించారు. దుర్గారావు సోదరి మేడిది లత ఫిర్యాదు మేరకు పాలకొల్లు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై సరిదే శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శారదాదేవికి ఘన నివాళులు

పెనుగొండ: ఆచంట సొసైటీ ఛైర్ పర్సన్ వైట్ల శారదాదేవి చిత్రపటానికి పూల మాల వేసి మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఘన నివాళులర్పించారు. శనివారం శారదాదేవి నివాసంలో తనయుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్‌కుమార్‌ను ఓదార్చి సంతాపం వ్యక్తం చేశారు. రుడా ఛైర్మన్, ఆచంట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకురాలు మేడపాటి షర్మిలారెడ్డి తదితరులు కిషోర్‌ను పరామర్శించారు. పరామర్శించినవారిలో పెనుగొండ ఏఎంసీ ఛైర్మన్ వెలగల వెంకటరమణ(మిస్సీ), పెచ్చెట్టి సత్యనారాయణ, కోట వెంకటేశ్వరరావు ఉన్నారు.

బుల్లమ్మాయి కుటుంబ సభ్యులకు పరామర్శ

పెనుమంట్ర: ఇటీవల మార్టేరులో మృతి చెందిన వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యురాలైన కర్రి బుల్లమ్మాయి మృతి పట్ల రాజమండ్రి రుడా ఛైర్ పర్సన్, ఆచంట నియోజకవర్గ పరిశీలకురాలు మేడపాటి షర్మిలారెడ్డి విచారం వ్యక్తం చేసారు. శనివారం మార్టేరులోని ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. బుల్లమ్మాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు

పాలకొల్లు అర్బన్: ఆగర్తిపాలెం ఎయిడెడ్ పాఠశాలలో శనివారం ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. 6 నుంచి 10వ తరగతి వరకు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు, ప్రతిభావంతులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఇన్‌చార్జ్ హెచ్ఎం యండావు రాజన్‌బాబు, సహోపాధ్యాయులు ఎం రాము, ఎం జయకుమారి, ఉషశ్రీ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మండల వ్యవసాయ శాఖాధికారిగా జ్యోశుల

పెనుమంట్ర: పెనుమంట్ర మండల వ్యవసాయశాఖ అధికారిగా అడబాల జ్యోశుల శనివారం బాధ్యతలు స్వీకరించారు. మండల వ్యవసాయశాఖ అధికారిగా పనిచేస్తున్న మద్దాల జయమాధురి గుంటూరు వ్యవసాయశాఖ కమిషనరేట్‌కు బదిలీకావడంతో నర్సాపురంలో వ్యవసాయ విస్తరణాధికారిగా పనిచేస్తున్న జ్యోశులను పెనుమంట్ర మండల ఇన్‌చార్జ్ అధికారిగా నియమించారు. ఆమె బాధ్యతలు స్వీకరించి స్థానిక ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజును మర్యాదపూర్వకంగా కలిసారు.